# తామరపల్లి సత్యంగారి తమ్ముడు రాముం...

''బలభద్రపురం వెళ్ళిరావాలి'' అంది మా అమ్మ.

''ఎందుకూ?'' అంది మా చెల్లాయత్త.

''తెగులొచ్చి మంచానపడి, ఈ మధ్యే పత్యం పుచ్చుకున్న మా పడాల ఆదెమ్మని చూసొద్దారి'' అంది మా అమ్మ.

''జట్కా కట్టించుకుని కొంకుదురు మీంచెళదాం. మా అమ్మనీ, మా తమ్ముళ్ళు విశ్వనాథాన్నీ, సాంబుల్నీ పలకరించేసి నీతో పాటు నేనూ వచ్చేస్తానంది'' మా చెల్లాయత్త.

''జట్కాబండయితే నేనూ వస్తాను కొంకుదుట్లో మా అక్కింట్లో దిగొచ్చు'' అంది మా నాయనమ్మ.

కాలవ దగ్గర వీరాస్వామి జట్కా మాటాడుకున్నారు.

మా అక్కని మా వాళ్ళంతా వెళ్ళే ఆ ఊరే ఇచ్చాం. ''పిల్ల కడుపుతో ఉంది దానికేవన్నా వండి తీసుకెళ్తే బాగుంటుంది గదా?'' అంది మా నాయనమ్మ.

''అవునొదినీ బాగుంటుంది కదా?'' అంది మా చెల్లాయత్త.

''ఈ మనిషి ఒక్కర్తీ ఏం పడగలదు మనిద్దరం కూడా తలో చెయ్యీ వేద్దావే'' అని మా నాయనమ్మ అనడంతో ''సరే'' అనేసి పన్లోకి దిగింది మా చెల్లాయత్త.

నొటికేమొస్తే అది వాగడం తప్ప ఏవంటా రాదు మాఅమ్మకి. నీకు రాదు అంటే గయ్యిమని లేస్తది. అందుకని అంతా తనే చేస్తున్నట్టు మా అమ్మని వాళ్ళ మధ్యలో కూర్చోబెట్టుకుని పాలముంజిలూ, ఇమ్మిర్తీలూ చేసి మూడు చిన్న ఇత్తడి బిందెల్లో సర్దేరు.

తెల్లారిందో లేదో ఇంట్లో అందరిమీదా అరవడం మొదలెట్టింది మాఅమ్మ. అరవడం అంటే మామూలుగా అరవడం కాదు ఈ వీధి చివర్నుంచి ఆ చివరోళ్ళకి వినపడే లాగ పెద్ద పెద్ద గంతులు అరుపులు కేకలు అలా అరుస్తానే మెదడు లోపలికి ఏదో పురుగు దూరినట్టు రెండు చేతుల్తోటి తలని పట్టేసుకుని మెలికలు తిరిగి పడిపోతుంది.

మాసిపోయిన బట్టలకోసం వచ్చేడు పుల్లయ్య.

''సచ్చినోడా, గొల్లిగా, సెట్లో సెంబాకారీ ఎదవా!'' అని వాడ్ని చెడామడా తిట్టేసి మాసి పెట్టి తన్నేసరికి అది కింద పడి మాసిన బట్టలన్నీ బయటికొచ్చినియ్యి.

ఆ బట్టలమీద పడి మెలికలు తిరిగిపోతా "అమ్మా... అబ్బా" అంటూ కేకలు.

ఈవిడికేదో అయ్యింది... పిచ్చెక్కిందనుకుని పారిపోయాడు చాకలి పుల్లయ్య.

ఇదిగో సూరమ్మగారూ అనరుస్తా జట్కా ఆపిన వీరాసామి మీద ఈలోగా దిగిన మా చెల్లాయత్తా మా నాయనమ్మల మీద పడింది. కాస్సేపటికి బాధతో గిలగిలా తన్నుకుంటా కింద పడింది.

తన పెద్ద బోదకాలుతోనే ఊరంతా తిరిగి వైద్యం చేసే మందులఅప్పన్నని తీసుకొచ్చాడు మానాన్న.

రెండురోజులు తగ్గినట్టే తగ్గి మళ్ళీ మొదలు. ఏదోమూల విరుచుకుపడి పోయి గిలగిలా కొట్టకోడం ఆ టైములో వచ్చినోళ్ళని నోటికొచ్చినట్టు తిట్టడం చేస్తుంది.

ఇంకలాభం లేదని రాంపురంలో గాంధీ డాక్టరుగారి దగ్గరకి తీసుకెళ్ళేం.


పార్శ్యం నొప్పి అని చెప్పి మందులిచ్చేరు డాక్టరుగారు.

తగ్గినట్టే తగ్గడం మళ్ళీ మొదలవడం.

పార్శ్యం నెప్పుల్లో ఏదో పెద్దరకం దీనెప్పి అనుకున్నాం.



చెలికాని రామారావుగారి దగ్గరకీ శేషగిరిరావుగారి దగ్గరకీ ఇలాగ రామచంద్రపురంలో ఉన్న డాక్టర్లందరి దగ్గరకీ తీసుకెళ్ళేం మా అమ్మని. ఎవరే మందులిచ్చినా రెండ్రోజుల తర్వాత మామూలే.



ఒకరోజు వీధిలోంచెళ్తున్న కర్రీరమ్మ మా అమ్మ యాతన చూసి ''రామంగారి దగ్గర కెళ్దాం పద'' అంది.

పెద్ద వీధిలో ఉన్న రాజేశ్వరస్వామి గుడికి ఎడం పక్కనుంది తామరపల్లిసత్యం గారిల్లు. వాళ్ళు బంగారం పని చేస్తారు. కర్రీరమ్మ చెప్పిన రామం సత్యంగారి తమ్ముడు.

మేం వెళ్ళే సరికి ఎడమకంటికి బూతద్దం పెట్టుకుని సాలిగూడు దారంకంటే సన్నగా ఉన్న బంగారపు తీగని నాజూగ్గా లేత బెండకాయల్లాగ సన్నగా ఉన్న తన వేళ్ళతో అల్లుతున్నాడు. ఆయన అందమైన వేళ్ళనే చూస్తా ఉండి పోయేను. ఆడపిల్ల వేళ్ళలాగ ఎంత సన్నంగా, సుతలు ఎంత అందంగా ఉన్నాయి అనుకున్నాను.

మమ్మల్ని చూసిన రామంగారు లేచి బయటికొచ్చేడు.

మా అమ్మ పడుతున్న బాధ ఆయనకిచెప్పింది కర్రీరమ్మ.

''ఇన్నాళ్ళనించీ ఎందుకు రాలేదు'' అన్నాడు రామంగారు.

''ఈళ్ళు మనూరికి కొత్తలెండి బ్రెహ్మంగారూ'' అంది కర్రీరమ్మ.

లోపలికెళ్ళి తెల్లగా సున్నంలాగున్న మందు ముద్దని చూపుడువేలి సుతకి అంటించుకొచ్చి మా అమ్మకి పార్శ్వంనెప్పి వస్తున్న ఎడమకంటి కనుబొమ్మకింద నరాన్ని గమాత్తుగా పట్టుకుని ఆ సన్నటి చూపుడు వేలుతో మందు ముద్దని అక్కడ మెత్తగా అద్దేసి ''మందు కంట్లోగానీ వెళితే కన్నుపోద్ది జాగ్రత్త స్నానం చేసేటప్పుడు కరక్కండా చూసుకోండి'' అన్నాడు.

బేడ డబ్బులిస్తామంటే నవ్వేసి ''వద్దండి'' అన్నాడు.

''సరే'' అనేసి వెనక్కి తిరుగుతున్నామో లేదో పది మంది పోగడిపోయేరు ఆళ్ళంతా ఈ నెప్పితో అవస్థపడేవాళ్ళే.

రెండు మూడు రోజులయ్యేసరికి ఆ రామంగారు మందు పెట్టిన చోట పుండు కింద పడిపోయింది.

గయ్యిమని లేచిన మా అమ్మ ''ఇదేంటిది ఆ బ్రహ్మన్నడుగుతాను'' అని బయల్దేర బోతుంటే బలవంతంగా ఆపేడు మానాన్న.

కొన్నాళ్ళకి ఆ పుండు తగ్గింది.

అంతే,

ఆరోజు తర్వాత మళ్ళీ ఎప్పుడూ పార్శ్యం నెప్పి అన్నది రాలేదు మా అమ్మకి.

ఊరికి కొత్తగాబట్టి మాకు తెలీదుగానీ రామంగారి పార్శ్యం మందుకోసం ఎక్కడె క్కడినించో వస్తారంట.

ఆ మందు పాళ్ళేంటో తెల్సుకుందారని చాలా మంది అడిగేరు రామంగార్ని.

నవ్వేసి ఊరుకున్నాడుతప్ప చెప్పలేదు.

మా చుట్టుపక్కల ఆయుర్వేదం డాక్టర్లు చెప్పమని చాలా డబ్బు ఆశ చూపించేరు.

నవ్వేసిన రామంగారు ''ఆ మందు ఎవరికిచ్చినా రాగి డబ్బు తీసుకోన్నేను. డబ్బు తీసుకుంటే మందు పని చెయ్యదు. మీకిప్పుడు చెపితే దాంతో వ్యాపారం చేస్తారు. చెప్పను'' నిక్కచ్చిగా చెప్పేసేడు.

* * *

రావులపాలెం దాటి కొత్తపేట వెళ్ళే దారిలో కుడి పక్కకి తిరిగి అయిదారు మైళ్ళెళితే చిట్టూరివారి పాలెం వస్తుంది. ఎక్కడెక్కడినించో వచ్చిన చిట్టూరి అనే ఇంటి పేరు గలవాళ్ళంతా అక్కడ ఇళ్ళు కట్టుకుని చిట్టూరివారిపాలెం అని పేరు పెట్టుకున్నారు.

వాళ్ళే ఆ ఊరికి మధ్యలో అందమైన రాములోరిగుడి కట్టేరు. ఆ ఏడాది నవమికి రాములోరికి కిరీటం అమ్మవారికి రవ్వలవడ్డాణం చేయిస్తానని మొక్కుకున్న చిట్టూరి వెంకట్రామయ్యగారు సరిగ్గా నవమినాడు అమలాపురంలో నలబాటి గున్నయ్యగారనే ఆయన్తో నగలు చేయించి తెచ్చి అలంకరించేరు. ఎందుకోగానీ వాటిలో కళ అన్నది కనపడలేదు వెంకట్రామయ్యగారికి.

ఎవరో చెపితే వెంటనే చిన్నకారు కట్టించుకుని గౌతమీబ్రిడ్జీ దాటి మండపేట మీదగా మాఊళ్ళో కొచ్చేసి సరాసరి రామంగారింటి ముందు దిగాడు.

సన్నటి అందమైన తన వేళ్ళతో చిన్న పట్టకారు పట్టుకుని బంగారం గొలుసుకి మెల్ల వేస్తున్నాడు రామంగారు.

నెమ్మదిగా నడుచుకుంటా లోపలికెళ్ళిన వెంకట్రావయ్యగారి కేసి తలెత్తి చూసిన రామంగారు ''రండి కూర్చోండి'' అన్నాడు.

తనెవరో ఎక్కడ్నుంచి వస్తున్నాడో చెప్పి నీలం రంగు ముఖమల్ సంచిలో నగల్ని రామంగారి ముందు బోర్లాపోసి ''చూళ్ళేక పోతున్నాను వెంటనే వీటిని కరిగించేసి కొత్త నగలు చేసి పెట్టండి... మజూరీ ఎంతయినా పర్లేదు ఇదిగో బజాణా'' అని కొంత డబ్బిచ్చి నగలు ఎప్పుడిస్తారో కనుక్కుని సుడిగాలిలాగొచ్చిన మనిషి సుడిగాల్లాగే వెళ్ళిపోయాడు.

రామంగారు రమ్మన్నరోజు దిగాడు చిట్టూరి వెంకట్రామయ్యగారు.

''మజ్జిగ గానీ, మంచి తీర్థంగానీ పుచ్చుకుంటారాండీ?''అడిగేడు రామంగారి అన్న సత్యంగారు.

''అన్నీ పుచ్చుకునే వచ్చాను...మా రాములోరి నగలు చేసిస్తే పండగ భోజనం పెట్టినట్టు'' అన్నాడు.

వెంకట్రామయ్యగారిచ్చిన ముఖమల్ సంచిలోంచి తను చేసిన అమ్మవారి రవ్వల వడ్డాణం తీసేడు రామంగారు. దాన్ని చూసిన వెంకట్రావయ్యగారి కళ్ళు జిగేల్మన్నాయి. కళ్ళద్దాలు తుడుచుకుని మళ్ళీ మళ్ళీ చూసేడు.

దేవుడికిరీటం కూడా తీసేడు రామంగారు.

మొత్తం చూసుకున్న చిట్టూరి వెంకట్రావయ్యగారు ''ఆహాహా ఏం పనితనం... ఏం పనితనం''అనేసి రామంగారి సన్నటి వేళ్ళని ముద్దెట్టుకుని మాటాడుకున్న మజూరికి రెండు రెట్లు ఎక్కువిచ్చి గాలిలాగ దూసుకొచ్చిన మనిషల్లా వెళ్ళలేక వెళ్ళేడు.

అలా ఆయనెళ్ళిన కొన్నాళ్ళకి చిట్టూరి వారిపాలెం నించి కొంతమంది మనుషు లొచ్చి మేంఫలానా ఆయన పంపిస్తే ఫలానాచోట నించొస్తున్నాం అని చెప్పి 'రేపు దేవుడి కళ్యాణంతో పాటు మీకు సన్మానం చేయబోతున్నాం తప్పకండా రావాలి తమరు'' అని తను వాళ్ళతో పాటు కదిలే దాకా ఊరుకోలేదు.

* * *

అయితే వారంలో ఆర్రోజులు చాలా కష్టపడే రామంగారు ఆదివారం రోజు మట్టుకు గంటసేపు శుభ్రంగా స్నానం చేసి అశోకా టెర్లిన్ షర్టూ గేబర్డీన్‌పేంటూ వేసుకుని, కున్‌గా మరికుళందు సెంటు రాసుకుని కొత్తగా కొన్న సువేగా మీద బయల్దేరి ద్వారపూడి వెళ్ళిపోతాడు.

ఆ వూళ్ళో తొందర్లో తనకి కాబోయే భార్య నాగలక్ష్మి ఉంది.

మధ్యాన్నం అక్కడే భోజనంచేసి ఈవారంలో కొత్తకొత్త బంగారం పన్లు ఏమేం చేసేడో ఎంత సంపాయించేడో, రేపు పెళ్ళయ్యాకా పెట్టబోయే సంసారం కోసం ముందర గానే ఏమేం వస్తువులు కొన్నాడో చెపుతాడు. తలుపు చాటున నిలబడున్న నాగలక్ష్మి అన్నీ వింటది. ఎప్పుడన్నా ఓ ముక్కఅంటది.

నాలుగింటికి కాసిని టీనీళ్ళు పుచ్చుకుని మండపేటలో తొలాట సినేమా జూసి ఏ రాత్రికో ఇంటికి జేరతాడు.

మళ్ళీ శనివారం దాకా మామూలే.

ఒకరోజు రాయవరం నించి ఒకాయనొచ్చి ''నాకు బంగారపు పన్ను చేసి ఆ పన్ను మధ్యలో తెల్లటి పొడి పొదగాలి. మరి రాయి పెదాల లోపల చర్మానికి తగిలిగీరుకు పోగూడదు'' అన్నాడు. అది చేసి ఆయన్ని మెప్పించాడు రామంగారు. ఇంకో రోజు కోటిపిల్లినించి ఒక మనిషొచ్చి ''నాకు బంగారపు పాళి చేసి పెట్టాలి. కండీషనేంటంటే పెన్నుల కంపెనీ వాళ్ళు ముక్కుమీద వేలేసుకునేంత బాగా రాయాలి ఆ

పాళీ'' అన్నాడు.''ప్రయత్నిస్తాను'' అన్న రామం ఆ మనిషి ఎగిరిగంతేసేంత బాగా చేసిచ్చేడు పాళీ.

ఇలాగ, చెయ్యడానికి చాలా కష్టమయిన పన్లన్నీ రామంగారి దగ్గర కొచ్చేవి. ఎలాంటి పనన్నా సరే ఏనాడు నేను చెయ్యలేను అని వెనక్కి తిప్పడం జరగలేదు. ''ప్రయత్నం చేసి చూస్తాను'' అనేవాడు. చేసిచ్చేవాడు.

రోజులలాగ గడుస్తుండగా ఒకరోజు,

రామంగారి ముక్కు దగ్గర చిన్న సోబి మచ్చలాగ వచ్చింది దాన్ని గోకగా గోకగా పుండయింది. ఎన్నాళ్ళయినా మానలేదు సరిగదా అందమైన రామంగారి ముక్కుని తినేయడంతో అందమైన ముక్కుకాస్తా చప్పిడి ముక్కయిపోయింది. మా వూరికి రామచంద్రపురానికి మధ్యలో ఉన్న కుష్ఠురోగుల ఆస్పత్రికి వెళ్ళాడు.

మందులిచ్చారు కానీ గుణం కనపడలేదు.

ఒక ఆదివారం ద్వారపూడి వెళ్ళి తనిన్నాళ్ళు పోగేసిన మొత్తం డబ్బు సామాన్లు నాగలక్ష్మికి ఇచ్చేసి ''నాకు పెద్దజబ్బు వచ్చింది. నేనిక రాగూడదు'' అని చెప్పేసి వచ్చేసేడు.

పోను పోనూ, జబ్బువేళ్ళదెగ్గిరికి పాకింది.

దాంతో, పార్శ్యం నొప్పికి మందెయ్యాలంటే ఒక చేత్తో మెడకాయ పట్టుకుని ఒంచి ఇంకో చేతి చూపుడు వేలి సుతని మందు ముద్ద అంటించుకుని కనుబొమ్మకీ కంటి రెప్పకీ మధ్య నరం పట్టుకుని అక్కడ మెత్తాలి వేలి సుతనున్న ఆమందుని.

రామంగారి వేళ్ళు మొండాలయిపోతున్నాయి. వచ్చిన జనం అతన్ని చూసి వెనక్కెళ్ళి పోతున్నారు.

మందుపాళ్ళు వాళ్ళ అన్నగారయిన సత్యంగారికి చెప్పి కలిపించాడు. కుదర్లేదు. మేనల్లుడు చంటిబాబుతో కలిపించి ఎవరికో పెట్టిస్తే రెప్పమీద పెద్ద పుండయింది తప్ప నొప్పి నయమవ్వలేదు.

దాంతో ఒక్క రామంవల్ల తప్ప మా వల్ల అయ్యే పనిగాదు అనేసి మందెట్టే పని మానుకున్నారు.

కొన్నాళ్ళు గడిచినియ్యి.

ఎప్పుడూ జనంతో సందడిగా ఉండే వాళ్ళింటి తలుపులు మూసేసేరు.

అశోకా టెర్లిన్‌చొక్కాలు నాగలక్ష్మి దగ్గర కెళ్ళినప్పుడు వేసుకునే ఖరీదైన పాంట్లూ అందరికీ పంచి పెట్టేస్తున్నారు.

సువేగా బండి అమ్మకానికి పెట్టేరు.

జబ్బు బాగా ముదిరిపోయిన రామంగార్ని లోపల ఒక గదిలో పెట్టేరు.

అలా చీకట్లో ఉండిపోయిన రామంగారు. కుష్ఠువల్ల గొప్పగొప్ప బంగారపు పన్లు చెయ్యలేకపోతున్నానని బాధపడ్లేదు.

నాగలక్ష్మి నాకు కాకుండా పోయిన దానికి బాధపడ్లేదు.

''ఎవరూ ఇవ్వలేని, నేను మట్టుకే ఇవ్వగలిగే ఆ పార్శ్యం నెప్పి మందు ఇవ్వలేక పోతున్నానే... అయ్యో'' అని చనిపోయేదాకా బాధ పడ్డాడని వాళ్ళింటెదురుగా ఉన్న చింతా వెంకటకృష్ణారెడ్డిగారు చెప్పేరు.

* * *